


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### నేషనల్ అవార్డ్స్ జ్యూరీ మెంబర్‌గా...

**చిన్నప్పుడు చాలా** బ్లాక్ అండ్ వైట్ సినిమాలలో జడ్జీగారు కోర్టు హాల్లో "సైలెన్స్...సైలెన్స్" అని బల్ల మీద మా కార్పెంటర్ వీరాచారి సుత్తిలాంటి సుత్తితో కొట్టడం, లాయర్లు సావిత్రీ, జగ్గయ్యలాంటి వాళ్ళు లేచి, మెడ దగ్గర 'బో' సరి చేసుకుని "మిలార్డ్.. ఇందుమూలంగా చెప్పేదేంటంటే, నా సాక్షి నిరపరాధి, ప్రత్యర్థికి మానవతా దృక్పథంతో ఉరిశిక్ష పడేట్లు చెయ్యండి యువరానర్" అని చెప్పడం.. కోర్టు హాల్లో మేనర్స్ లేకుండా అందరూ చప్పట్లు కొట్టడం... అసెంబ్లీ హాలుని తలపింపచేస్తూ, కంగాపులగంగా మాట్లాడడం, జడ్జీ సుత్తితో కొట్టడం.. టేబుల్‌ని.. వాళ్ళని కాదు.

"సైలెన్స్ ...సైలెన్స్" అనడం, గొప్ప సరదాగా వుండేవి. ఇంక కోర్టులో సరదాలు... టీ కప్పు తెప్పించి, తాగుతూ మాట్లడుతూ లాయర్ దాన్ని ఎదుటి లాయర్ మీద విసిరికొట్టడం. అతను సడెన్‌గా తనవైపు నుండి వస్తున్న టీ కప్పును చూసి, బాలెన్స్ తప్పి "చంపేస్తా" అని తిడ్తూ, తూలి పడడం. "చూసావా?" అచ్చు అలాగే నా క్లయింట్ 'చంపేస్తా' అని నోరు జారాడు. కాలు జారాడు. ఇది అసంకల్పిత ప్రతీకార చర్య. ఇన్ వాలంటరీ ఏక్షన్" అనగానే, అంతా చప్పట్లు కొట్టడం, జడ్జీ కళ్ళజోడు తీసి, గంభీరంగా తల పంకించి, ఎదుట వున్న పేపర్ మీద మరణశాసనంలాంటిదేదో గబగబా రాయడం. కోర్టు బోన్‌లో వున్న ముద్దాయి గుండెలు గుబగుబలాడడం. ఇవన్నీ తృటిలో జరిగిపోతాయి. జడ్జి ఏం చెప్తాడా? అని లాయర్ వేషం వేసిన పెద్ద పెద్ద హీరోలు సైతం చెవులు రిక్కించి, ఆత్రుతగా వేచి చూడడం ఒకరోజు వేషానికి వచ్చిన సీనియర్ మోస్ట్ జూనియర్ ఏక్టర్, జడ్జిమెంట్ చదవడం. ఇవన్నీ చూసి, ఇంటికొచ్చి ఓ చెక్క కుర్చీ తిరగేసి అందులో మా సందానీగాడిని నిలబెట్టి బుజ్జివాళ్ళ నాన్నగారి పెద్ద నల్లకోటు తొడుక్కుని లాయర్ సావిత్రి అయిపోయి, ఎదురుగా వున్న ప్రతి లాయర్ వినోలియాతో బల్ల గుద్ది వాదిస్తూ "సందానీ గాడికి ఉరిశిక్ష పడకూడదూ.. పడకూడదూ... పడకూడదూ.. వాడు కేవల బడి దుమ్మా కొట్టి బచ్చాలు ఆడడానికి రంగనాథం మాస్టారు చచ్చిపోయాడని చెప్పాడేకానీ ఆయన్ని చంపాలని వాడికి ఏ కోశానా దురుద్దేశం లేదు మిలార్డ్" అనగానే,

వినోలియా "నేను ఖండిస్తున్నాను. సందానీగాడు, కరడు కట్టిన నేరస్తుడు, వాడికి ఉరిశిక్ష పడాలి యువరానర్" అనాలి.

మధ్యలో సందానీ "జడ్జిగారూ నన్ను రక్షించు" అని ఏడవాలి.

అప్పుడు నేను జడ్జినైపోయి, కళ్ళద్దాలు సవరించుకుని, నెత్తి మీద తిరగేసి పెట్టిన విసినకర్రలాంటిది తడుముకుని "వాద ప్రతివాదాలు విన్న తరువాత సందానీగాడు, నిరపరాధి అని తేల్చడం అయినది" అని చదవగానే, సందానీగాడు, "జడ్జిగారూ మీరు మనిషికాదు దేవత" అని నా కాళ్లమీద పడిపోవడం.. ఇలా ప్రాక్టీసు చేసేవాళ్ళం.

అసలు తెలుగు సినిమాల ప్రభావం వల్ల డాక్టర్ అయిపోదామా" ఇంక మానవ ప్రయత్నం కాదు. దైవ యత్నం వుండాలి. మన చేతుల్లో ఏమీలేదు. రోగికి పన్నెండు గంటల్లో స్పృహ వస్తే బతుకుతాడు" అని, తెల్లకోటు వేసుకుని భారంగా డైలాగ్ చెప్పి, గుండెల నిండా గాలి పీల్చి వదిలి, వెళ్ళిపోవడం ప్రాక్టీసు చేద్దామా లేక, నల్లకోటు వేసుకుని, "వాదప్రతివాదాలు విన్న తర్వాత ముద్దాయికి మరణ దండన విధించడం అయినది" అన్న డైలాగ్ ప్రాక్టీసు చెయ్యడమా? అని డైలమాలో వుండగానే, టెంత్ క్లాసు బోర్డ్ ఎగ్జామ్స్ రాయడం, మనకొచ్చిన మార్కులు చూసి మా అన్నయ్య "కిరాణా షాపు పెట్టుకోడానికి కూడా ఈ లెక్కల్లో మార్కులు సరిపోవని"రెచ్చగొట్టడం... నా డాక్టర్ కలకీ, జడ్జీ ప్రాక్టీసులకీ తిలోదకాలు ఇవ్వడం జరిగిపోయింది. కానీ జడ్జీ కావాలన్న నాకల మాత్రం దైవ కృపవల్ల నెరవేరింది.

సినిమా ఫీల్డులోకి వచ్చిన తర్వాత నేను పరుచూరి రఘుబాబు పరిషత్ పోటీ నాటకాలకి జడ్జిగా నాలుగేళ్ళు వ్యవవహరించాను. ఆ తర్వాత నంది అవార్డుల కమిటీలలో మూడుసార్లూ, నేషనల్ ఫిలిమ్స్ అవార్డ్స్ జ్యూరీలో రెండుసార్లూ, ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డ్స్ జ్యూరీ ఆఫ్ బెంగుళూరులో ఒకసారీ, 'సైకా' ఎవార్డ్స్ అంటే సౌత్ ఇండియన్ సినిమాటోగ్రాఫర్స్ అవార్డ్స్ ఇన్ మలేషియాకి ఒకసారీ జడ్జిగా వ్యవహరించాను.

ప్రతిసారీ జడ్జీలంటే,మా జ్యూరి మెంబర్స్‌కి ప్రత్యేక హోదాలుంటాయి. నాటక పోటీలైతే, నటులు మనతో మంచిగా వుంటారు. మనం ఎప్పుడైనా ఇంటర్వెల్‌లో ఎదురుపడి నవ్వితే, మా నటన బాగా నచ్చినట్లు వుంది అని పులకించిపోతారు. గొప్పగా చూస్తారు. కమిటీ వాళ్ళు కూడా మొదటి రోలో మినిస్టర్లూ వాళ్ళు వచ్చినా, మనని లేపకుండా పక్కనే కూర్చోపెట్టి, కూల్ డ్రింకులూ, పుణుగులూ ప్రత్యేకంగా పెడ్తారు. పెద్ద పెద్ద కలర్‌ఫుల్ బాడ్జీలు కూడా. బహుమతి ప్రదానం అయిపోయాక, నటీనటులు మనకి థాంక్స్‌లు చెప్తూ, మనతో ఫోటోలు తీసుకుంటారు. ఇవన్నీ బానే వుంటాయి కానీ, జడ్జిమెంట్ చేసి బహుమతులు నిర్ణయించడం అంత ఆషామాషీకాదు. మనం వేసిన మార్కులూ, చెప్పే పాయింట్లూ, మిగతా జడ్జీలని కన్విన్స్ చేసేవిగా వుండాలి. "ఆ నటుడు మా మావయ్యగారి ఇంటి మీద వాటాలో వుంటాడు. మాకు రాజమండ్రీ నుండి పనసపండు తెచ్చిస్తాడు కాబట్టి, మార్కులు ఎక్కువేసాను" అనడానికి మనం మా మమతా టీచర్‌లంకాదు. ఎన్నో ఏంగిల్స్‌లో ఆ నటుల నటనని ఆచి చూచి, మిగతా వారితో కంపేర్ చేసి, అత్యుత్తమమైనదీ అని ఎంపిక చేయాల్సి వుంటుంది. అలాగే నాటకానికి

మొత్తంగా ఇచ్చేటప్పుడు, ఇతివృత్తం, సంభాషణలూ, నటీనటుల నటనా, ఎంపికా, మేకప్, సెట్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్స్, సమాజం మీద ఇంపాక్ట్ "ఇవన్నీ జాగ్రత్తగా పాయింట్లుగా రాసి, మిగతా జ్యూరీతో చర్చించి, ఒప్పించి మెప్పించి ఫలితాలు ప్రకటించాలి. ముఖ్యంగా నాలాంటి వాళ్ళు, మళ్ళీ పొద్దున్న లేస్తే ఆ నటీనటులతో కలిసి పని చెయ్యాల్సిన వాళ్ళం. న్యాయసమ్మతంగా వ్యవహరించాలే తప్ప, మన బంధువులనో, స్నేహితులనో పక్షపాతం చూపకూడదు. ఏడో క్లాసుదాకా నా తెలుగు చాలా పూర్‌గా వుండేది "సులోచనా టీచర్‌కి పక్షవాతం. వాళ్ళ అమ్మాయికే మార్కులు ఎక్కువ వేస్తుంది" అనీ, అనసూయా వాళ్ళ నాన్నకి పక్షపాతం. పాపం ఒక చెయ్యి పనిచెయ్యదు" అనీ వాడేదాన్ని. ఇప్పుడు నాకు ఈ రెండింటికీ బాగా డిఫరెన్స్ తెలుసు.

ఆ తర్వాత నంది అవార్డ్ జ్యూరీలో వున్నప్పుడు, మనం జ్యూరీలో వున్నామని పేపర్‌లో వచ్చేది. అందుకే అందరికీ తెలిసి, " మా సీరియల్‌కి దయచేసి బహుమతి ఇప్పించండీ, ఇల్లు తనఖా పెట్టి తీసాను" అనీ, "నాకు ఉత్తమ హాస్యనటుడు ఇప్పించండి, మా ఆవిడకి ఆస్తమా, తండ్రికి పిచ్చి, తల్లికి హార్ట్ డిసీజ్. అయినా నవ్వుతూ నటించాననీ" ఇలా ఫోన్స్ వచ్చేవి. కొంతమంది ఇంటికే మామిడి పండ్ల బుట్టల్తోటీ, చీరలు కొనుక్కునీ వచ్చేస్తుంటే, తెగ ఇబ్బందిగా వుండేది. ఈరోజు జడ్జిమెంట్ ఇచ్చేసాకా, రేపు సమాజానికి మొహం చూపించాలనే కాదు, మనం గుండెలమీద చెయ్యేసుకుని పడుకోగలగాలి. మనకి అద్దంలో కనిపించి ప్రశ్నించే తెల్లచీరకట్టుకున్న ఆత్మసాక్షి ఒకటేడిసిందిగా. అదే మగాళ్ళయితే, తెల్ల పైజమాల్లో ఆత్మసాక్షి వుంటుంది. ప్రేతాత్మల్లా తెలుపేంటి? అంటారా? తెలుపు స్వచ్ఛతకి నిదర్శనం. మనసు తెల్లగా వుండాలి మొహాలు కాదు. పౌడర్ రాసుకుని రాంగోపాల వర్మ దెయ్యల్లా... మనం ఎంత నిజాయితీగా, నిస్వార్థంగా అవార్డ్‌లిచ్చినా, రాని వాళ్ళంతా మర్నాడు దొబ్బులు పెడ్తారు. అది వేరే సంగతి.

నేను 66వ నేషనల్ ఫిల్మ్ అవార్డులకి జ్యూరీ మెంబర్‌గా సెలెక్ట్ అయ్యానని ఫోన్ వస్తే, నేను ఒక్క నిమిషం తెల్లబోయాను. ఈ తెలుపు ఆశ్చర్యానికి సంకేతం. ఆ తర్వాత ఆనందానికిలోనయ్యాను. చిన్నతనంనుండీ ఆదివారం మధ్యాహ్నాలు రెండింటికి, నేషనల్ అవార్డ్‌లొచ్చిన జాతీయ ఉత్తమ చిత్రాలని చూస్తూ పెరిగిన వాళ్ళం. కొన్ని సార్లు ఆ వయసులో అర్థంకాకపోయినా, పెద్దయ్యాకా వాటి గొప్పతనం తెలిసింది. సత్యజిత్‌రే, మృణాల్ సేన్, గిరీష్ కాసరవల్లీ, శ్యాం బెనెగల్, ఆదూరి గోపాల క్రిష్ణన్.. వీళ్ళ పేర్లూ, వారి చిత్రాలూ చూస్తూ పెరిగాం. తెలుగు పేర్లు వినాలనీ, తెలుగు చిత్రాలకి సైతం జాతీయ స్థాయిలో గుర్తింపు రావాలని ఆశపడ్డవాళ్లం. ఇప్పుడు ఆ అవకాశానికి ద్వారాలు తెరుచుకున్నాయి. అని తహ తహలాడాను. ఫ్లయిట్ టికెట్స్, ప్రత్యేకమైన కార్లు, యూ ఆర్ ఏ సెంట్రల్ గవర్నమెంట్ గెస్ట్ అని రాసున్న లెటర్... మనకి పూలలో పెట్టి అందించే అశోకా హోటల్, అందమైన రిసెప్షనిస్ట్.. అశోకాలో సిల్వర్ కట్లరీతో వున్న ప్రత్యేకమైన వి.ఐ.పి రెస్టారెంట్‌లో స్పెషల్ డిన్నర్. రోజూ కేసినో మీద ఓ.పి.నయ్యర్, నౌషాద్‌ల సంగీతం వాయించే అతనికి మా ఫర్మాయిష్‌లు. తోటి అనేక రాష్ట్రాలనుండి వచ్చిన జ్యూరీ మెంబర్స్‌తో స్నేహాలు. మణిపురీ చైర్‌మైన్ ఇమోసింగ్ నా ఆవకాయ తిని కళ్ళు

మరింత చిన్నవిగా చికిలించి, "ఇట్స్ డెలీషియస్" అన్నప్పటి ఆనందం . కన్నడ మిత్రులు ఉప్పెట్టు కోసం కర్నాటకా భవన్‌కి సందు చూసుకుని పారిపోవడం.. రోజుకి ఐదు సినిమాలు చూస్తూ వున్నప్పుడు, గవర్నమెంట్ సర్వెంట్స్‌గా సిబ్బంది మనకి అందించే రిఫ్రెష్‌మెంట్స్, వాళ్ళిచ్చే కాఫీలూ, టీలూ, ఖాండవాలూ, డోక్లాలూ, చీకట్లో పెట్టే సౌత్ ఇండియన్ డిష్ అంటూ పేరు తెలీని పదార్థాల బారినుండి పారిపోయి, ఢిల్లీలో 'కుల్లాడ్'లో చాయ్ తాగడానికి పారిపోయే బడి పిల్లల వేషాలూ. బెంగాలీ వంటవాడు జిలేబీ, రసగుల్లాలు తప్ప మిగతావన్నీ ఉప్పూకారం, పులుపూ లేకుండా చేస్తుంటే నన్ను ఆదుకున్న నా ఊరగాయ సీసాలు.

తెల్లవారు ఝామున కలువలు విరిసిన కొలను చుట్టూ, ఢిల్లీ చలిలో నెహ్రూ పార్క్‌లో నేను చేసిన వాకింగులు.

కళ్ళప్పగించి చూసిన అద్భుత చిత్రాలు. తలలు వాచిపొయ్యి చిన్న మెదళ్ళు బయటకి వచ్చేసేట్లు చేసిన కొన్ని తలనెప్పి చిత్రాలు. . తోటి జ్యూరి మెంబర్లే కుటుంబంగా , కుటుంబానికి దూరంగా నెలరోజులు హోటల్‌గదిలో గడిపిన రాత్రులు. ప్రతిరోజూ రకరకాల పలహారాలతో, పెద్దహాలు నిండగా, మేం కబుర్లతో చేసే బ్రేక్ ఫాస్ట్‌లు, ఫైవ్ స్టార్ 'స్పా'లు. ప్రసిద్దులు అయిన నటులతో, దర్శకులతో మేం తీయించుకున్న ఫోటోలు..జడ్జిమెంట్ రోజున మేం కొట్లాడుకుని చేసుకున్న వాదోపవాదాలు... సీల్డ్ కవర్లు మంత్రిగారి సమక్షంలో ఇచ్చేసాక, వేసుకున్న జోకులూ.. జన్మాంతం చేసుకున్న స్నేహాలూ. అదొక అద్వితీయ అనిర్వచనీయ అనుభూతులు.

2022 సియాటిల్‌లో నేను మా అబ్బాయి పెళ్ళిచేసి, వాడి దగ్గర వుండగా, జూన్ నెలలో నేషనల్ ఫిల్మ్ అవార్డ్ డిప్యూటీ చైర్ పర్సన్ ఇంద్రాణీ బోస్ నన్ను " మీ సేవలు మాకు మళ్ళీ అవసరం అయ్యాయి 69వ నేషనల్ ఫిల్మ్ అవార్డులకి" అని ఫోన్ చేసారు. జూలై 17కి ఇండియాకొచ్చి 23నుండీ ఢిల్లీ వెళ్ళి జ్యూరీలో జాయిన్ అయ్యాను.

66వ నేషనల్ అవార్డుల జ్యూరీలో నేనుండగా కీర్తి సురేష్‌కి ఉత్తమనటీ, మహానటి సినిమాకి రీజనల్ బెస్ట్ ఫిల్మ్. ఇంకా అనేక శాఖల్లో మన తెలుగు సినిమాకి ఏడు అవార్డులు రావడం నా ఘనత అనుకానీ, నా కృషి ఎంతో వుంది. అక్కడ మన ప్రాంతీయ ప్రాతినిధ్యం వహించి వాదించడం చాలా అవసరం. ఎంత బావున్నా మన పోరాట పటిమ అవసరం. 69వ నేషనల్ అవార్డుల జ్యూరిలో నేను వుండగా పదకొండు అవార్డులు వచ్చాయి. ఒక తెలుగు హీరో అల్లు అర్జున్‌కి మొదటిసారిగా బెస్ట్ ఏక్టర్ అవార్డు రావడం విశేషం. అలాగే నేనున్న జ్యూరీలో ఒక గీత రచయిత చంద్రబోస్‌కి జాతీయ అవార్డు రావడం కూడా నాకు పర్సనల్‌గా అత్యంత సంతృప్తినిచ్చిన విషయం.

జాతీయ అవార్డుల జ్యూరీలో వుండగా ఇద్దరు ప్రెసిడెంట్లని కలిసాను. మొదటిసారి రామనాథ్ కోవింద్‌గారినీ, వారి సతీమణి సవిత గారినీ. రెండవసారి ద్రౌపది ముర్మునీ.

మొదటిసారి అమితాబ్ బచ్చన్, షెహన్‌షా ఆఫ్ ఇండియన్ సినిమాకి దాదాసాహెబ్ పాల్కే అవార్డు ఇచ్చినప్పుడు 'రాష్ట్రపతి భవన్'లో 'తేనీటీ విందు' ఇచ్చారు. ప్రెసిడెంట్ రామనాధ్ కోవింద్ జీ, ఆయన సతీమణి సవిత కోవింద్ జీ, మా అందరి దగ్గరకీ వచ్చి మా పేర్లు అడిగి మేం ఏ రంగం నుండీ, ఏ ప్రాంతం నుండీ వచ్చామో తెలుసుకున్నారు.

శ్రీ అమితాబ్ బచ్చన్... నా చిన్ననాటి కల తీర్చి, నా చెయ్యి పట్టుకుని కరచాలనం చేసారు. ఆయన దాదా సాహేబ్ ఫాల్కే అవార్డుకి కూడా జ్యూరీ మెంబర్‌గా నా పేరు ఉండడం నా పూర్వజన్మ సుకృతం. వారి ఫ్యామిలీతో హై టీ తీసుకున్నాం.


రెండవసారి జ్యూరీ మెంబర్‌గా వున్నప్పుడు నా భర్త ప్రభాకర్‌ని కూడా విజ్ఞాన్ భవన్‌కి నాతో తీసుకెళ్ళడం మరువలేని జ్ఞాపకం. ఇద్దరు ప్రెసిడెంట్లు... రెండుసార్లు నా పేరు రాసివున్న ఆసనం అధిరోహించడం.. అద్భుతం... అనిర్వచనీయమైన అనుభూతులు.


Post your comments

















https://www.youtube.com/watch?v=ERaaX_IulS4







